# ◀కొత్త రచయితలు

# లవ్ స్టోరి టు కోమలి

"గుడ్ఈవినింగ్ నవీన్" గదిలోకొచ్చింది కోమలి.

"హలో. వాటె స్ప్రైజ్" అంటూ అతనామెను ఆహ్వానించాడు.

"అదేమిటి మా ఆఫీస్‌కు ఫోన్ చేసావట. మా కొలిగ్ చెప్పింది. నేను ఆ టైంలో సీటులో లేకపోవడంవల్ల తను మాట్లాడింది" అంటూ అతని కెదురుగా కుర్చీలో కూర్చుంది.

"అవుమలే గవర్నమెంటు ఆఫీసుల్లో ఎవరూ సీటులో వుండరు" అన్నాడు నవీన్ ఆమెను ఉడికిస్తున్నట్టుగా.

ఆమె మాత్రం తక్కువ తిన్నదా అన్నట్టు "నిజమే పాపం ప్రైవేట్ కంపెనీల వాళ్ళు సీటులో వుండరు. ఆఫీసు టైంలోనే ఎవరితో ఒకరితో ఫోన్‌లో బాతాఖానీ వేస్తుంటారు" అని రిటార్టిచ్చింది.

ఇద్దరూ నవ్వుకున్నారు.

"ఏమిటి విశేషం. అయ్యగారికి వున్నట్టుండి చూడాలనిపిస్తున్నట్టుంది. ఏకంగా ఆఫీసుకే ఫోన్ చేయడం మొదలుపెట్టారు."

"ఏం తప్పేముంది. కాబోయే భార్యా భర్తలు ఫోన్‌లో మాట్లాడుకోకూడదా?"

"అబ్బా. అదే నీతో వచ్చిన చిక్కు! ఎప్పుడూ ముక్కు మీదే వుంటుంది కోపం. అయినా నువ్వే అన్నట్టు 'కాబోయే' భార్యా భర్తలమే కానీ ప్రస్తుతానికి కాదు కదా?"

"సర్లే ఇప్పుడే నన్ను ఆట పట్టిస్తున్నావు ఇక పెళ్ళయిన తర్వాత ఫోన్ కూడా చేయనిస్తావేమిటి? "

"ఈ విషయాలకేం గానీ మన పెళ్ళి సంగతి మీ పెద్ద వాళ్ళతో చెప్పావా. మా నాన్నగారు నా మాట కాదనరనుకో ఆ నమ్మకం నాకుంది. అందువల్లే నీ దగ్గర లైన్‌క్లియర్ చేసుకుని నాన్నగారితో విషయం కదలేద్దామనుకుంటున్నాను."

నవీన్ మాట్లాడలేదు. ఆమె కళ్ళలోకి చూసి చిలిపిగా నవ్వుతున్నాడు. అతన్నే తేరిపారా చూస్తున్న కోమలి అందగాడేనని ఇంకొకసారి అనుకున్నది. ఇటువంటి వాడు తన భర్త కావడం కూడా తన అదృష్టమనుకుంది. ఆమె ఆంధ్రదేశంలో పుట్టి పెరిగిన సగటు ఆడపిల్ల. ఆస్తి పాస్తులకు తగ్గ కోరికలే వున్నాయి. కోరికల మోజులో నేల విడిచి సాము చేయలేదు. తండ్రి రిటైరవడం డిగ్రీ పాసయిన తనను ఉద్యోగ ప్రయత్నం చేయించి గవర్నమెంటు ఆఫీసులో కూర్చోబెట్టింది. ఆ తర్వాత నవీన్‌తో పరిచయం ఇంతవరకూ వచ్చింది.

"ఏమిటి అయ్యగారు. పరాకు చిత్తగిస్తున్నారు" తన మాటకు సమాధానం రాకపోవడంతో కోమలే ప్రశ్నించింది.

నవీన్ నవ్వుతున్నాడు.

"ఎందుకబ్బా అంత నవ్వు" బుంగమూతి పెట్టేసింధి కోమలి.

"ఇప్పుడు నువ్వెంత అందంగా వున్నావో తెలుసా. ఎంతంటే..."

"అంత" అన్నాడు కొంతసేపటికి. చాల్లే బడాయి అంటూ మూతి తుడుచుకుంది కోమలి. పైకి చికాకు ప్రదర్శించినా అతను అందించిన ముద్దు అనుభూతి ఆమెను సిగ్గులో ముంచెత్తింది.


రచయిత చిరునామా

బి.రమేష్

ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సెంట్రల్ ఎక్సైజ్

హౌస్ నెం: 23–37–11

వర్రావారివీధి

సత్యనారాయణపురం

విజయవాడ–11


"ఇంత అందం నా స్వంతమవుతుంటే నేనెంత అదృష్ట వంతుణ్ణి" అన్నాడు నవీన్.

"ఎంతో చెప్పలేముకాని. నా అంత అని మాత్రం చెప్పగలను" కోమలి సమాధానం చెప్పింది.

"నిజం"

"ఆ. అక్కడే వుండాలి. ఇంతకీ మీ వాళ్ళతో ఎప్పుడు మాట్లాడుతున్నావు. పెళ్ళి చూపులు, లాంఛనాలు వగైరాలు గిట్టవబ్బాయీ ముందే చెబుతున్నాను. నీ ముందు, మీ వాళ్ళ ముందూ సిగ్గుగా తల వంచుక్కూర్చోవడం, మీ వాళ్ళు రకరకాల ప్రశ్నలు వేయడం నాకు నచ్చవు. అయినా మనిద్దరం పరిచయస్తులం. పైపెచ్చు ప్రేమికులం. కాని పెద్దవాళ్ళ ప్రమేయం లేకుండా పెళ్ళి చేసుకోవడం సభ్యత కాదు కాబట్టి ఇరుపక్షాల పెద్దల్ని ఒకచోట కూర్చోబెట్టి అక్షింతలు వేయించుకోవడం. లాంఛనాలు వగైరాలతో మమ్మల్ని ఇబ్బంది పెట్టకూడదు. ఎందుకంటే వాటివల్ల మన పెళ్ళి జరగడం ఆగదు. అట్లా అని మా వాళ్ళు నీకు అన్యాయం చేయరనుకో. ఏదో ఉన్నంతలో బాగానే..." కోమలి కొంటెగా నవ్వింది.

"అబ్బా. రాణీగారి కోరికల లిస్టు చాలానే వున్నదే."

"ఇంకా చాలా వున్నాయి. కానీ ఇప్పటికే రాత్రి ఏడయిపోయింది. ఇక ఇంటికి వెళ్ళిపోవాలి. నాన్నగారు కంగారు పడుతూ వుంటారు" కోమలి కుర్చీలోంచి లేచింది.

"కూర్చో కాస్త కాఫీ తీసుకుని వెడుదువుగాని!"

కిచెన్‌లోకి దారి తీసాడు నవీన్. ఆమె కూడా వంట గదిలోకి వెళ్ళింది.

"గుడ్. సామానంతా చేర్చేసావే. సంసార తాపత్రయంలో పడ్డావన్నమాట"

"అన్నీ రెడీగానే వున్నాయి. ఇక నీదే అలస్యం అనుకో. అదుగో చూసావా ఆ డబుల్ బెడ్ నువ్వెప్పుడొస్తావా అన్నట్టు జాలిగా చూస్తోంది" అంటూ కిచెన్ పక్కనే వున్న బెడ్‌రూంలోకి దారి తీశాడు.

ఆ గదిలోకి వెళ్ళిన కోమలి నవీన్ అభిరుచిని మెచ్చుకోలుగా చూసింది. అద్దె ఇల్లే అయినా చాలా చక్కగా సర్దుకున్నాడు. ముఖ్యంగా పడక గది.

"ఏయ్ నవీన్ ఏమిటిది" అంటూ ఉలిక్కి పడింది.

ఎందుకంటే అప్పటికే నవీన్ చేతులు ఆమెను చుట్టుకొని వున్నాయి. తన జడలో మల్లెలను వాసన చూస్తూ మెడమీద వేడి గాలి వదిలే

స్తున్నాడు. అతనిలో ఏదో తెలియని కోరి: బుసలు కొడుతున్నట్టనిపిస్తోంది

"నవీన్ ప్లీజ్ వదులు" బయటి గుమ్మం వైపు చూసింది. అప్పటికే అది గడియ పెట్టేసి వుంది.

"ప్లీజ్ నా కిష్టం లేదు"

"ఏం నామీదేమయినా అనుమానమా"

"అనుమానం కాదు. నా మీద నాకే అప: మ్మకం"

నవీన్ మాట్లాడడం లేదు. అమె శరీరం మీద అతని చేతులు స్వైరవిహారం చేస్తున్నాయి. అతని స్పర్శ చేష్టలు ఆమె శరీరంలో వింత ప్రకంపనాలు సృష్టిస్తున్నాయి. దానికి తట్టుకోవడం కూడా ఆమెకు కష్టమయిపోతోంది. శరీరం మనసును త్రోసిరాజని అతని కనుగుణంగా మసలమని ఆదేశిస్తోంది.

"ప్లీజ్ వదలమంటుంటే" అన్నది కోమలి, అన్న తర్వాత అనుకున్నది అనకుండా వుంటే బాగుండేదని.

"పెళ్లి కాకుండా నా కిష్టం లేదు"

"ఓస్ అంతే కదా నేనంటే ఇష్టం లేక కాదు కదా"

"అలా అయితే ఇంత దగ్గరా ఎందుకొస్తాను."


"ఇంత దగ్గరగా వచ్చిన దానివి ఆ కాస్త దగ్గరగా కూడా వస్తే."

మళ్లీ నవీన్ అన్నాడు "ఆ మాత్రం నాకు తెలీదనుకున్నావా. నీకేమీ ఇబ్బంది రాకుండా జాగ్రత్త పడతాను. డోంట్ వేస్ట్ టైం"! ఇక ఆమెను మాట్లాడనివ్వలేదు.

ఆమె కూడా మాట్లాడలేకపోయింది. ఎందుకంటే ఆమె ఆమె కాదు. అతనితో సమానంగా ఆరాటపడి ఇద్దరూ ఎదుటివారి ఎనాటమీల గురించి పరిశోధించి వారిని తమ కోరికలకు అనుగుణంగా మలుచుకుని ఆ పోరాటంలో ఆవేశపడి అందుకున్న ఆనందానికి అబ్బురపడి సృష్టి రహస్యంగా ఇదీ అని నిర్ధారించుకుని అలసిపోయారు.

"మొత్తానికి నువ్వనుకున్నది సాధించావు" అన్నది కోమలి దూరంగా విసిరేసిన బట్టలను అందుకుంటూ.

"నువ్వు మాత్రం తక్కువ తిన్నావేమిటి" అలసిన ఆమె ముఖం అతనికి ఇంకా అందంగా కనబడింది.



"మళ్లీ వద్దు బాబూ ఇప్పటికే ఆలస్యమయింది" అందామె అతన్ని గమనించి.

మళ్లీ ఎప్పుడన్నట్టు చూసాడు నవీన్.

"ఇదిగో నా మెడలో మూడుముళ్ల పడిన తర్వాతే" అన్నది కోమలి.

బిక్క మొగమేసాడు నవీన్. "బీ బ్రేవ్ మై హబ్బీ" అంటూ కోమలి వెళ్లిపోయింది. అనుభూతి అందించిన అలసటతో నవీన్ తొందరగానే ఆరోజు నిద్రపోయాడు.

లేడీ డాక్టర్ చెప్పిన విషయం విన్న కోమలి తెల్లబోయింది. ఆమె కుటుంబంలో ఎప్పటి నుంచో వున్న పరిచయం వల్ల "మీ నాన్నగారికి అతనెవరో చెప్పి తొందరగా పెళ్లి చేసుకో" అని సలహా కూడా ఇచ్చింది డాక్టర్.

కోమలి ఆటోలో ఇంటికి వస్తూనే తన గదిలోకి వెళ్లిపోయింది. ఆమెను ఆలోచనలు ముప్పిరి గొన్నాయి. కొంతసేపటికి వరకూ ఇదమిద్ధంగా తేల్చుకోలేకపోయింది. ఆమె ఒక నిర్ణయానికి వచ్చేసరికి ఇంచుమించు అర్ధరాత్రి అయింది. అప్పుడామెకు ప్రశాంతంగా నిద్రపట్టింది.

మర్నాడే నవీన్‌కు ఒక ఉత్తరం అందింది.

"నవీన్ గారికి,

ఇది ప్రేమలేఖో — విరహ వేదనో అని మీరు భ్రమపడకండి.

మీరు నాకు చేసిన "సహాయానికి" నా కృతజ్ఞతలు. అందులో నా ప్రమేయం కూడా వుందనుకోండి. అయినా మీదే ప్రధాన పాత్ర. మీ బిడ్డకు నేను తల్లిని కాబోతున్నాను. మాతృత్వంలోని మాధుర్యాన్ని ఆస్వాదించే పరిస్థితుల్లో నేను లేను. ఇందుకు కేవలం మన పెళ్లి కాకపోవడమే కారణం కాదు. మీరు నా నమ్మకాన్ని వమ్ము చేశారు. కాబోయే జీవిత భాగస్వామినిగా నా విశ్వాసాన్ని మీరు నిలుపుకోలేకపోయారు. నిజానికి నేను ఏ పరిస్థితుల్లో వశమయ్యానో మీకు తెలుసు. మీ మీద నమ్మకం లేదా అని అడిగారు. మీ మీద నమ్మకం మీరు నన్ను పెళ్లి చేసుకుంటారా లేదా అని మాత్రం కాదు. నేను నేనుగా మిగిలిన మీ దాన్నవుతున్నప్పుడు నా విశ్వాసాన్ని, నమ్మకాన్ని కాపాడుకోవలసిన బాధ్యత మీమీద వున్నది. అది మీరు సక్రమంగా నిర్వర్తించలేకపోయారు. ఆ రోజు జరిగిన దానికి నా బలహీనత ఎంత మాత్రమూ కారణం కాదు. ఎందుకంటే నాకే గనక ఇష్టం లేకపోతే అరిచి గోల చేసేదాన్ని. అంతేగాని అంత తేలిగ్గా మీకు లొంగేదాన్ని కాదు.

ప్రేమ అంటే రెండు మనసుల స్పందన రెండు శరీరాల మధ్య ఆకర్షణ మాత్రమే కాదు. రెండు జీవితాలకు ఆలంబన, ఒకరి విశ్వాసాన్ని రెండవ వారు గౌరవించే సాధనం కావాలి. అటువంటి ప్రేమ మీ దగ్గర లేదు.

ఆఖరి మాట. మీ బిడ్డను మాత్రం నేను భూమి మీదకు రానివ్వను. నా పేరు శరీరానికి మాత్రమే వర్తిస్తుంది. మనసుకు కాదు. గుడ్ బై.........

మీ కాలేకపోయిన
కోమలి

●


ఇప్పుడు

స్వచ్ఛమైన బంగారంతో
తయారు చేయబడిన

స్వర్ణ భస్మ శక్తియొక్క అనుభవాన్ని
పొందండి




మీరు విటా-ఎక్స్ అనుభవాన్ని చవిచూసారు. ఇప్పుడు ఆయుర్వేదం ఎరిగిన అతి వీర్యవంతమైన సూత్రీకరణ స్వర్ణ భస్మశక్తితో కూడిన విటా-ఎక్స్ గోల్డ్ అనుభవాన్ని చవిచూసేందుకు సిద్ధంకండి.

ఆయుర్వేదంలో ప్రముఖ ప్రామాణ్యులైన డాక్టర్. కె. ఎమ్. నడకర్ని ఏమంటారంటే "స్వర్ణ భస్మ తిరిగి యవ్వనాన్నిచ్చేలా, పురుషత్వ పుశక్తులను రేపేలా పనిచేస్తుంది" అని. భావ్ ప్రకాష్. చరక్ (శతాబ్దాలుగా తరచుగా సంప్రదించబడుతున్న పురాతన ఆయుర్వేద గ్రంధాలు) ప్రకారం ఈ సూత్రీకరణ సహజ శక్తి ప్రదాయినిగా పేర్కొన బడింది. ఈ విషయం పాశ్చాత్య దేశాలలో గుర్తింపు పొందిందికూడా. విటా-ఎక్స్ గోల్డ్ మరింత సమృద్ధమైన, నిండైన, శక్తియుతమైన జీవనానికి 100% సహజమైన ఆయుర్వేదపు శక్తి యొక్క ఖని. మరచిపోకండి.

ఆలస్యం అయితేనేం. ఆనందించండి. జీవితాన్ని సహజంగా!

**బైద్యనాథ్ విటా-ఎక్స్**

**గోల్డ్**

బైద్యనాథ్ — 700 పైగా ఆయుర్వేద ఉత్పాదనల ఉత్పాదకులు